# కథా సుగంధాలు - నాగరాజు గంధం



## జీవితానికో పుష్కరం

కే.శే. నాగరాజు గంధం

**"ఇంత ఇదిగా బతిమాలించుకుంటున్నావ్?** అసలెన్ని పుష్కరాలని చూశావేం?" అన్నాడు మా రాఘవుడు.

ఒక జీవితానికి ఎన్నని చూస్తామే పుష్కరాలు? - ఆయుష్షూ అవకాశం ఉండి చూసినా చూసిందల్లా పుష్కరమౌతుందా? చేసిందల్లా పుణ్యస్నానమౌతుందా? పిల్ల వెధవయ్య నన్ను పుష్కర స్నానం చేయించాలన్న పట్టుదలతోనే ఆ మాటన్నాడు - ఏవో జ్ఞాపకాలు మనసుని ముసిరి ముట్టుకున్నాయి.. వాడి మాటలు విన్నాక.

"గోష్పాదక్షేత్రం దగ్గర బావగారు కనిపించారు. నీకిమ్మన్నారు" - మడి బట్టల్లో వంటింటి గుమ్మం దగ్గర నిలబడ్డ నా చేతిలో ఓ కాగితపుండ పెట్టి తుర్రుమన్నాడు రామకోటి - చెప్పొద్దూ గుండెలవిసిపొయ్యాయి. పాడు పిల్లాడు ఎంతటి తెగేసిన ధైర్యమో - పనివేగిరం తప్పించి వివరమెరగని మేళమని, ఇలానా దీన్ని నాకందియ్యడం?

ఇంటినిండా ఇంటెడు చుట్టాలు. గుళ్ళో చేయించే అర్చనలు చాలవన్నట్లు పుష్కరాల సందర్భంగా ఇంట్లో కూడా ఆ దేవ దేవుడికి కైమోడ్పులు కైంకర్యాలు, ఏవేళకి కావలసినవి అప్పటికందించడానికి నాన్నగారి కోపపు గాడ్పు తగలకుండా తడిమడి గుడ్డలతోనే వంటింట్లో రెండు చేతులు ఖాళీలేకుండా సతమతమవుతున్న నాకు వీడి మిడిమేళపు రాయబారపు మోపు.

అసలు పసివెధవ వీడినని ఏవిటి లాభం? ఈ మాత్రపు కాగితపు ముక్క పంపించటానికి వీడినెంచుకున్న ఆయన గారి వ్యవహారపు సులువు ఈ మాత్రపుది - చేతిలో ఉన్న కాగితపు చుట్టని పిడికిళ్ళ మధ్య గట్టిగా బిగించి పట్టుకుని దొడ్డివైపు రెండడుగులు వేసేసరికల్లా -

"ఎవరికి వాళ్ళు చల్లగా సర్దుకుని జారుకోకండే తల్లీ. మహానైవేద్యం పెట్టడానికి అరక్షణం ఆలస్యమైందంటే నీళ్ళకి నిప్పంటించి, నెత్తిన పోస్తాడు అన్నయ్య" అన్న పెద్దత్తయ్య గద్దింపు కదలకుండా కట్టిపడేసింది.

రుబ్బిన గారెల పిండిని రోట్లోంచి గిన్నెలోకి తోడుతూ - "ఇక్కడ ఇంతపని పెట్టుకుని ఎక్కడికే అమ్మడూ?" కాస్తంత నెమ్మదిగా అడిగింది శాంతపిన్ని.

"ఏఁవిటని చెప్పటం?" - నెమ్మదిగా మూసిన గుప్పిటనుండి చిటికెన వేలు మాత్రం తెరిచాను.

"బాగానే ఉంది తల్లి మీ శంకలు.. వంకలు - ఇక నువ్వేం వంటింట్లోకి దిగబడనవసరంలేదు. ఆ అల్పాచమానం తరువాత స్నానం కానిచ్చి మాములు బట్టలు తగిలించుకుని సందులో 'కాఫీ పొయ్యి' దగ్గర అఘోరించు చాలు. సుందరొక్కతే చస్తోంది అంతమందికీ కాఫీలు పొయ్యలేక" - ధుమధుమలాడుతూ నన్ను కూతురికి సాయంగా తోసేసింది పెద్దత్తయ్య.

అదురుతున్న గుండెల్ని చిక్కబెట్టుకుని - ముఖంపైకి ఏభావం తేలకుండా గబుక్కున దొడ్లోకురికి ఒక వారగానున్న పున్నాగ చెట్టు దగ్గరకెళ్ళి గుప్పిట విప్పి నలిగి ఉండయిన కాగితాన్ని సరిచేసి చూశాను - 'ఈ వేళ సాయంత్రం నువ్వు గోష్పాదక్షేత్రానికి స్నానానికొచ్చినపుడు -' అంతేరాసుందక్కడ. అర్థంకాలేదు. ఊс..! గోష్పాదక్షేత్రానికి స్నానానికొస్తే ఏమౌతుంది? ఆయనగారు కాని రారుకదా. గుండెలు గుబగుబలాడిపోయాయి.

అమ్మో ఇంకేమైనా ఉందా? - ఆయనగారు నన్ను పలకరించినా, ఆయనవంక నేను కన్నెత్తి చూసినా నాన్నగారి గమనింపులో కెడితే గోదారి ఆవిరైపోదూ సాయంత్రం స్నానానికి నే వెళ్ళనూ వద్దు, ఆయనగారు నన్ను కలవనూ వద్దు కాగితాన్ని ముక్కల కింద చింపి నీళ్ళకోసం రాజేసిన గాడిపొయ్యిలోవేసి మరో అడుగు స్నానాల గదిలోకి వేసి రెండు చెంబులు నెత్తినపోసుకుని, పొడిబట్టల్లోకి మారి - కాఫీ పొయ్యి దగ్గరున్న సుందరి దగ్గరకెళ్ళాను. ఏడోనెల కాబోలు తనకి పైపొట్టవడంతో నెలలు నిండినట్టే ఆపసోపాలు పడుతోంది.

నన్ను చూడగానే - "వీళ్ళ కాఫీలు కూల. గోదారంతా కాఫీ కింద కాసిచ్చినా తాగి తగలేసినట్టున్నారు. పాడు చుట్టాలని ఈ గోదారొడ్డున కొవ్వూరులోనే మనమెందుకు పుట్టాలి, పన్నెండేళ్ళకొక్కసారి ఈ కంచి గరుడసేవలు చేయడానికా?" - అంది ఆయాసపడుతూ.

నవ్వొచ్చింది దాని అవస్థ చూసి - కాని ఆ నవ్వు నా ముఖాన తేలటంలేదు. గుండెల్లో ఆయనగారు రాజేసిన సెగ వేడికి ముఖాన నవ్వు పూత పుయ్యటంలేదు.

అరక్షణంలో కనిపెట్టేసింది సుందరి - "ఎదుర్లంక వరపుత్రుల నుండి మళ్ళీ పిలుపైందేవిటే?" అంది.

నాకు దానికి దాపరికాల్లేవు - "మరే" - అన్నాను గోడవారనున్న స్టూలు దానికి వీలుగా జరిపి, చేయి జాస్తూ.

"అబ్బో! మొత్తానికి పట్టువదలని విక్రమార్కుడే" అంటూ నా చెయ్యిచ్చుకుని పొయ్యిముందు నుంచి లేచి నెమ్మదిగా స్టూలు మీద కూర్చుంది.

అనకేం జేస్తుంది? మూడు నెలల్రితం నాడు రాయమండ్రి కోట బజారులో జరిగిన భాగోతం దానికి తెలియందికాదు. పెద్దత్తయ్యకి శాంతపిన్నికి మధ్యగా నడుస్తున్న నన్ను పోల్చుకుని - నడిబజారులోనే బిగ్గరగా - 'ఏమోయ్ వరదరాజేశ్వరి చిన్నమాట' - అంటూ కేక పెట్టారు. నే హడలి బిగుసుకుపొయ్యా. మాకు ముందుగా నడుస్తున్న నాన్నగారు, ఆయనకి మద్దతుగా పెద్దత్తయ్య - నడిబజారులో ఇంటల్లుడన్న ఖాతరు లేకుండా ఈయనగార్ని కడిగి మడుగులు పోశారు. గుడ్లనీళ్ళు కుక్కుకుంటున్న నన్ను శాంతపిన్ని పొదివి పట్టుకుంది.

అంతటి అవమానం జరిగినా ఆయన ముఖాన అదే నవ్వు. 'ఈ శతమానంలో ఆశీర్వాదాలేమైనా ఉంటే అవినాకు మీ అమ్మాయికి, అక్షింతలు మటుకు మీ వియ్యంకుడికీ, మీకూ ఉంటాను మామయ్యగారు' అని పెద్దత్తయ్య కళ్ళపడేట్టు మరి నాకేసి కన్నుగీటి చక్కాపోయారు.

ఇంటికొచ్చాక అత్తయ్య 'మారోజుల్లో ఎరగం తల్లి ఇలాంటి బజారు భాగవతాలు' అంటూ రోజుల తరబడి చెప్పింది. పెళ్ళయ్యాక పుట్టినింట్లో నెలవుదప్పి నిలబడాల్సి వస్తే నిలువెత్తు నామర్దే కదా ఆడపిల్లకి.

"ఏ జవాబూ చెప్పవేమే నంగిపిల్లా" అంది సుందరి

"నంగితనమో నా ప్రారబ్దమో - మరో నగుబాటు తప్పదనే భయం - పెళ్ళైన క్షణమే కాటికి పిలుపొచ్చినా ఈ అవమానాలు తప్పేవి" అన్నాను.

నా గొంతులో మార్పు కనిపెట్టేసింది సుందరి.

"ఎందుకే చాతకాని ఏడుపులు - అనకూడదు కానీ పెద్దవాడు మామయ్య బుద్ది పనికిమాలిపోయింది. సరే సరిసమానులతోనే వియ్యమందాడు. అచ్చంగా మీనాన్నలాంటివాడే మీ మామగారు కూడా. అంగరంగవైభవంగా పెళ్ళిచేసుకున్నారు. మూడురోజుల పెళ్ళి, మున్నూరు అగ్రహారాల పండితులు ఆశీర్వదించారు.

మేజువాణి దగ్గర మేనమామలు తగులాడుకున్నారని - చిన్న విషయాన్ని చిలికి చీధం చేసుకుని పిల్లల్ని కాపురం చేసుకోనీయని పాపం నే ఎక్కడా వినలేదు కనలేదే తల్లి - వీళ్ళు సరే మీ తెలివెటు తెల్లారినట్టు? ఒక్కమాట అనుకుని, తెగించి ఒకటౌతే కాదని వీళ్ళు వార్చగలిగే గంజేంటి? అది మానేసి 'వరదా' గొంతు చించుకుంటూ ఆయన - హానాథా అని కళ్ళెంట గోదారి నింపుకుంటూ నువ్వు - ఎందుకొచ్చిన పితలాటకాలు?" అంది.

నిజమే ఎందుకీ పితలాటకాలు ఈ రోజు ఆయనగారు కలిసినప్పుడు అడిగేస్తే - అనిపించింది.

"ఏఁవిటి కథ.. ఈ రోజుగాని ఏ గోష్పాదల రేవు దగ్గరకో పుష్కరస్నానానికి వచ్చి కలుస్తానని వర్తమానం చేశాడా కోటగుమ్మం వీరుడు" నా కళ్ళల్లోకి చూస్తూ అంది.

ఔరా సుందరి. నా కళ్ళ కిటికీల నుండి గుండె గదులేమన్నా కనిపిస్తాయేంటే నీకు. అనుకున్నాను. అవునంటూ తలాడించి "నీకెలా తెలుసు?" అడిగాను.

"ఇందాక రామకోటిగాడు హడావిడిగా మా అక్కేది అని అడిగితే విషయం చెప్పమన్నాను. గోష్పాదల దగ్గర కనిపించిన బావ అక్కకి తప్ప మరెవ్వరికీ ఏమీ చెప్పద్దని చెప్పాడు - అని వాడు చెప్పాడులే" అంది. ఒక్కక్షణం ఈ కాఫీ పనేదో కాస్త నువ్వు చూసుకో అని సుందరికి చెప్పి లేచాను. ఆయన మళ్ళీ ఎక్కడ కనిపిస్తారో - అజా ఏమైనా రామకోటికి తెలుసా అని కనుక్కుందామని.

చిటికినవేలు పట్టుకుని తన చిత్తమొచ్చిన వైపు బరబరా లాక్కెళ్ళిపోతున్నాడు రామకోటి.

ఎదురుగా పరవళ్ళు తొక్కుతున్న పుష్కర గోదారి, చుట్టూ పరుగులు తీస్తున్న జనగోదారి - ఇంతటి ఒరవడిలో ఒకళ్ళనొకళ్ళు ఒరుచుకుంటున్న తొడతొక్కిడిలో ఏవైపని వెతకటం?. ఆయనగారికోసం ఏ వంకని చూడటం? అక్కా అదిగోనే బావ - అంటూ దూరంగా ఉన్న ఆయన్ని వేలెత్తి చూపించాడు రామకోటి. ఆ వైపునే చూసేంతలోనే చప్పున నాచేయి విడిపించుకుని ఆ వైపు దూసుకుపోయాడు. తెప్పరిల్లి ఆ వైపుగా కదిలేంతలో - "అమ్మ మీ అఘాయిత్యం కూల ఎంత సేపని వెతకనే మీకోసం? అవతల మీ నాన్న అరిచి అరిచేస్తున్నాడు కదులు" అంటూ పెద్దత్తయ్య నా రెక్కపట్టుకుని స్నాన ఘట్టం మెట్ల మీదకి గుంజుకునిపోయింది. ఆయనగారి అయిపులేదు. రామకోటి చిన్న వెధవ ఈ జనంలో పక్కకి తప్పిపోయాడో తెలీదు.

మూడు మునకలయ్యాక తడిబట్టలతోనే స్నానఘట్టం నుండి పైకొచ్చి యాత్రికులు బట్టలు మార్చుకోవడం కోసం పెట్టిన 'తడిక అడ్డాల' మధ్యలోకి దూరాను.

"నాలుగడుగులు వేస్తే ఇల్లు - ఈ మాత్రపు దూరం తడి బట్టలతో నడిచేందుకు సిగ్గా? పద్దెనిమిదేళ్ళ గుంటలకే ఇంతటి సిగ్గయితే ఇకమేమేమని అనుకోవాలి?" బయట నిలబడి సన్నగా గొణుగుతోంది పెద్దత్తయ్య.

తడికి ఒంటికతుక్కుపోయి పాపికొండల మధ్య గోదారిలా నా పయ్యెదల మధ్యపాయగా చిక్కడిపోయిన చీరకొంగు తీసి, కుచ్చిళ్ళు జార్చేశాను. ఆయన కనిపించలేదన్న బాధ గుండెలని మండిస్తోంది. లంగాముడి లాగేసి కాళ్ళ మధ్య కుప్పలా పడ్డ తడి లంగాని ఓ మూలకి విసురుగా తన్నాను. అంతగా రాదలుచుకోలేని మనిషి కబుర్లు. వర్తమానాలు చేయడం దేనికో అనుకున్నాను. మనసంతా తెంపులేని దిగులు కమ్మి కళ్ళు వరదగోదారులై పొయ్యాయి.

కళ్ళనీళ్ళు తుడుచుకునే ప్రయత్నాలేవీ చేయకుండానే జాకెట్ హుక్స్ కూడా విడదీసి, ఒక చేతిని బయటకు తీసి మరో చేతిని లాక్కుంటుండగానే బైట అత్తయ్య గొంతు గందరగోళంగా వినిపించటం ఆ వెనుకనే చటుక్కున తడిక తెరుచుకోవడం ఒక్కసారిగా

జరిగిపొయ్యాయి. ఈ హడావుడికి చేతికి ఊడొచ్చిన జాకెట్‌ని అప్రయత్నంగా కిందకొదిలేశాను. ఎదురుగా ఆయన ఒక్క క్షణం నా దిసెమొలతనాన్ని కన్నార్పకుండా చూసి జరుగుతున్న దేంటొ అర్ధమయ్యేలోపుగానే తడికకు మరోవైపున పెట్టుకుని ఉన్న నా పొడిచీరని ఒకదాన్ని నా ఒంటికి చుట్టపెట్టేసి నన్ను అమాంతంగా భుజాలకెత్తుకుని ఒక్క అంగలో బయటికొచ్చిన స్నానఘట్టం వైపు మెట్లు దిగడం ప్రారంభించారు.

నా బుర్ర పనిచేయడం మానేసింది. మెట్లుదిగి వెళ్ళడం ఎటువైపు - ఎదురుగా గోదారి - ఆయన మెడచుట్టూ చేతులేసి, ఒంటిని ఆయనకి బలంగా అదిమేసి గట్టిగా కళ్ళుమూసుకున్నాను. ఆయన అడుగులు మెట్లమీద నా బరువుతో సహా భారంగా పడుతున్న ప్రతిసారి - నా గుండెలు ఆయన ఒంట్లో దిగిపోతాయా అన్నట్లన్పిస్తోంది. చల్లటి నీటి స్పర్శతో కళ్ళు తెరిచాను.

ఎకాఎకిన గోదావరిలోకే దిగిపోతున్నాం నడుంలోతు నీళ్ళలోకి చేరగానే పొడిచీర తడిబారి గుండెలమీదనుండి జారడం మొదలెట్టింది. 'ఇప్పుడెందుకీ పుష్కర స్నానం?' ఆలోచన ప్రశ్నగా మారక మునుపే నన్ను భుజాల మీద నుండి దింపి దగ్గరగా పొదివిపట్టుకుని నీటిలోకి నాతో సహా మునకేశారు. చల్లటి గోదారి. వెచ్చటి ఆయన కౌగిలి ఈ రెండింటి మధ్యా ఉక్కిరిబిక్కిరి కూడా హాయిగానే తోచింది. అలా నీళ్ళలో నాలుగు బారలు సాగి పైకి తేలేసరికి స్నానఘట్టానికి దిగువగా ఓ పడవ - నేను తెలివిన పడేసరికి ఆయనతో సహా పడవ పైకే చేరాను.

నా జీవిత సరంగు పడవని కదిల్చాడు. ఎక్కడికీ ప్రయాణం? అర్ధం కాలేదు అడుగుదామంటే - ఎందుకో అడగబుద్ధికాలేదు. గోదారి పైరగాలికి పొడారిపోయిన చీర కొంగు అకస్మాత్తుగా నన్ను చుట్టని వెర్రిగాలి వెంట పిచ్చి పరుగందుకోబోయింది. క్షణకాలం పూర్తిగా పయ్యెదల నుండి తప్పి తెరచాపలా లేచిన కొంగుని గబుక్కున అందుకుని భుజాల చుట్టూ కప్పుకుని ఒక్కసారి చూసుకున్నాను. అస్తవ్యస్తంగా ఏడ్చిన నాకోక కట్టుబడిని - ఏవైపు నుంచి ఏవైపుకు సర్దుకున్నా మరేదో వైపు వెలితిగా మిగిలిపోవడమే. నా అవస్థ చూసి నవ్వారాయన.

"అంత సర్దుకోవాల్సిన పనిలేదులే. నే చూడక మిగిలిందేమీ లేదక్కడ" అన్నారు కొంటెగా.

కొంతమేర సిగ్గేకమ్మింది. దాంతోపాటే నాన్నగారికి తెలీకుండా ఇలా హఠాత్తుగా పడవెక్కి నడిగోదారి కొచ్చెయ్యడం, పెద్దత్తయ్య చేస్తూవుండే యాగి గుర్తొచ్చి - కడుపులో బెంగగా అనిపించి కళ్ళవెంట నీళ్ళు సుళ్ళు తిరిగాయ్.

"ఒంటిమీద ఈ చీర తప్ప మరో గుడ్డముక్క లేదు తమరి కంటికి ఇంపుగానే ఆనచ్చు సరే - లోకానికంతా ఇలానే కనపడమంటారా? మాట మంచి లేకుండా ఇలాగెత్తుకొచ్చేశారు" తెలీకుండానే నిష్టూరంగా ధ్వనించింది నా గొంతు.

నా నిష్ఠూరం - ఆయన గమనింపుకొచ్చినట్టే ఉంది. నా వంక మరోమారు పరీక్షగా చూసి చటుక్కున పడవని దిశ మార్చారు. కొద్ది దూరంలో కనిపిస్తున్న ఓ చిన్న ఇసుక దిబ్బను చేరింది పడవ.

చప్పున దాన్ని లంకనలేం. గోదారి మధ్యలో ఏర్పడ్డ పెద్ద ఇసుక మేటలా అనిపిస్తోంది. ఒడ్డు వదిలేసి కాస్త లోపలగా విశాలంగా పరుచుకున్న సరుగుడు చెట్లు - దట్టంగా అలుముకున్న రెల్లుగడ్డి. మొత్తానికి పెద్దదిగానే అనిపిస్తోంది ఆ ఇసుక దిబ్బ. ఈ దిబ్బ దగ్గర పడవెందుకు ఆగిందో అర్ధం కాలేదు.

ఆయనే అన్నారు - "నీకు నే చీరకట్టే సమయమెక్కడుంది అక్కడ? - అప్పటికే నీ పక్క మూడు తడికలు తెరిచాను - అదో కంగారు అందుకే హవుడిగా చుట్టేశాను చీరె - అలా చెట్టు చాటుకెళ్ళి సరిగ్గా కట్టుకో"

"అయ్యబాబోయ్. అయితే మరి ముగ్గిర్ని నాలా చూసేశారన్నమాట" ఆయన మాటలు వినడంతోనే నా ముఖం చిటపటలాడటం గమనించి చిరునవ్వు నవ్వారు.

"నీ అంతలా వాళ్ళు కనిపిస్తే నీదాక ఎందుకు వాళ్ళనే తెచ్చేవాడ్నికదా. ముందెళ్ళి చీరకట్టుకురా" అన్నారు.

''మరే పుష్కరస్నానానికి రాలేదు వాళ్ళు మరి. మీరే నావెక్కిస్తారా అనొచ్చారు'' అంటూ చటుక్కున పడవదిగి నాలుగడుగుల్లో సరివి చెట్టుచాటు చేరి ఓ మాకు చుట్టూ చూసుకుని నిర్మానుష్యమని కాయపడ్డాక చుట్టుకున్న ఉడుపును విప్పదీశాను. ఎంత ఒంటరిగానైనా నగ్నంగా నిలబడ్డ స్పృహ మనసులో ఏదో తొందర చేస్తోంది.

చీరని ఒక్కమారు దులిపి, కుచ్చిళ్ళు పోసి ఓ మెలి తిప్పి ఆరుతుందన్నట్లుగా కొమ్మ పైకి వేసేంతలో - వెనక పాటుగా ఎండుటాకునలిగిన సవ్వడి. తలతిప్పి చూశాను. ఆయనే నవ్వుతూ కనిపించారు. మరుక్షణం చీరెని కప్పుకుని ''ఏఁవిటా విపరీతం అవతల సూర్యుడు కుంగిపోతున్నాడు. చీకటి పడేవేళకైనా ఏదో ఒక జనవాసానికి చేరుకోవాలా వద్దా'' అన్నాను చిరుకోసం ప్రదర్శిస్తూ.

మాట చెవిలో దూరితేనేగా కప్పుకున్న చీరతో సహా తన కౌగిలిలోకి లాక్కుని ఊపిరందనట్లు నా పెదవులని తన పెదవుల్లోకి తీసుకున్నారు. మరికొద్దిసేపటికి ఆయన చేతులు చీర చెరుగుల్లోకి జారటం గమనించి బలమంతా ఉపయోగించి దూరంగా తోసేశాను.

అస్తమిస్తున్న సూర్యుడిని చూపుతూ ''ఇది సంధ్యా సమయం. ఆహార, నిద్రా మైథునాలు నిషేధం - ఎంత మాత్రమూ ధర్మసమ్మతం కాదు'' అన్నాను.

విన్న ఒక్క క్షణం తరువాత అర్థమయినట్టు తలపంకించి ''నిజమే ధర్మసమ్మతం కాదు. నువ్వు చీర కట్టుకుని పడవ దగ్గరకిరా'' అని పడవకేసి వెళ్ళిపోయారు.

చీరని పొందికగా కట్టుకుని పల్లెవాటుని జాగ్రత్తగా భుజాల చుట్టూ కప్పుకుని పడవవైపు వెళ్ళిన నాకు గోదారొడ్డున తీరిగ్గా కూర్చుని పూర్తిగా పశ్చిమానికి కుంగిపోతున్న సూర్యుడ్ని చూస్తున్న ఆయన కనిపించారు.

అక్కడ పడవలేదు. కంగారెత్తిపోయింది.

''పడవేది?'' అని అడిగాను.

''గాలివాటుకి కొట్టుకుపోయింది'' అన్నారు.

''చీకట కూడా పడుతోంది. ఈ దిబ్బమీద ఇలా ఒంటరిగా చిక్కడిపొయ్యాం'' అన్నాను నేను కంగారుగా.

ఆ మాటలకి మారుపలకలేదాయన. నా రెక్కపుచ్చుకు లాగి తన పక్కగా కూర్చోబెట్టుకుని - నా నడుం చుట్టూ చెయ్యేసి తనకు దగ్గరగా హత్తుకున్నారు.

''మనం ఒంటరిగా ఎందుకున్నాం?'' గుసగుసలాడారు. నిజమే ఆయన పక్కనుంటే నేవిటి ఒంటరి తనం? ఆయన గుండెల్లో తలదాచుకున్నాను కొద్దిసేపు. మా మధ్య ఎన్నో సంగతులు మౌన భాష్యాలుగా ప్రవహించాయి. నెమ్మదిగా కదులుతున్న గోదారి కెరటాలు మా కాళ్ళని తడుపుతున్న క్షణాన హఠాత్తుగా ఆయన తన తలని నెమ్మదిగా నా గుండెలమీదుగా జార్చి ముఖాన్ని నా పొట్టకి ఆన్చుతూ నా ఒళ్ళో పడుకున్నారు.

వెచ్చటి ఆయన ఊపిరి నా పొత్తికడుపును కొలిమిగా మార్చి మండిస్తోంది. ఏదో వెచ్చటి ఒత్తైన హాయి నా నాభ్యాంతరాలకి ప్రవహించినట్లయింది.

నా ఒళ్ళు వేడెక్కింది. రెండు చేతులు ఆయన తలలోకి జొనిపి, జుట్టుని పిడికిళ్ళతో పట్టి దూరంగా జరపబోయాను. ఆయన కళ్ళతోనే నవ్వుతూ చూశారు.

''వరద రాజేశ్వరి. ఒక్కసారి పైకి చూడు చంద్రోదయమైంది. ఇది సంధ్యకాదు. రాత్రి ధర్మసమంతమే'' ఆ మాట అంటూనే ఆ మాట అంటూనే నా నడుము ఒంపునున్న చీరకట్టుకి ఒంటికి మధ్యనున్న జాగాలో చెయ్యిపెట్టి లాఘవంగా ముందుకు జరిపి చీరకుచ్చిళ్ళు గుంజేశారు. గాలివాటుకి పేకపేడ కూలినట్టు ఆయన లాగిన విసురికి చీర గుత్తగా ఒంటిమీదనుండి జారిపోయింది. మరుక్షణం నుండి ఆయన చేతుల్లో మైనపు బొమ్మనే అయ్యాను నేను.

వెల్లికిల్లా వాలిపోయిన నాకు ఆయన పెదవులు నా ఒంటిపై చేస్తున్న ప్రయాణం కళ్ళుమూసుకున్నా కనిపిస్తూనే ఉంది. ఆ క్షణాల్లో కళ్ళు తెరిస్తే - వెన్నెల కురిపిస్తున్న చందమామ - ముద్దలుగా మెరిసే నక్షత్రాలు - ఆపైన వన్నెల పాలపుంత, కళ్ళుమూస్తే - తన మోహామృతాన్ని కురిపిస్తున్న ఆయన - ఆ ప్రేమగుర్తులుగా తేలే నఖక్షతాలు - ఆ పైన ఆయన వక్షం కింద నలిగిపోతున్న నా పసిడి పాలగుండెలు. ఏదో అర్థంలేని వెతుకులాటలో పడ్డ ఇద్దరం ఒకరిలో ఒకరం ఐక్యమయ్యే ప్రయత్నంలో గోదారి ఒడ్డునుండి నీళ్ళలోకి జారిపొయ్యాం. ఆ నిర్జన వెన్నెల వాటికలో పవిత్ర పుష్కర గౌతమీ ప్రవాహంలో అనంతాకాశం సాక్షిగా నేనాయనకి నాలోకి దారినిచ్చానాక్షణం.

పంచభూతాల సాక్షిగా మా పునఃసంధానం ప్రకృతీ పాత్రంగా జరిగిందక్కడ. ఆ రాత్రంతా ఇసుకతిన్నెల్లో సరుగుడు పొదల్లో, పుష్కర గోదారి అలల్లో మేమెన్నిమార్లు ఏకశరీరులమయ్యామో.. ఎవ్వరికెరుక?

అలసి సొలసి ఏ ఆఖరి జాములోనో కనురెప్పలు మత్తెల్లిన క్షణం - ఏదో గుర్తొచ్చి నేనే అడిగాను.

"ఇంతకీ మన ప్రయాణానికి మరో పడవెలాగ?"

"ఏమో ఆ పుష్కరుడిని తలుచుకునే గోదారిలోకి గెంటేశాను. మళ్ళీ ఆయనే వెనక్కి పంపుతాడులే. "నా వైపు నవ్వుతూ చూస్తూ అన్నారాయన. అంటే ఈయనగారి నిర్వాకమే నన్నమాట పడవపోక. ఆయన తెంపరితనానికి నాకు సిగ్గేసింది. అప్పుడే తూర్పున తెల్లారిన సూర్యుడు ఎర్రగా నా ముఖాన ఉదయించాడు.

ఆ తరువాత కొద్దిసేపటికి గజీతగాళ్ళతో సహా మా కోసం వెతుకులాటకి బయలుదేరిన నావ మమ్మల్ని చూసి మావైపు కదలివచ్చింది. అందులో అందరికన్నా ముందు మా వైపు చూసి నవ్వుతూ చెయ్యూపాడు రామకోటి - ఆ వెనుకగా నాన్నగారు ఆయన చేతిలో చెయ్యేసి మామయ్యగారు చిరునవ్వులు చిందిస్తూ కనిపించారు.

"మనతోపాటే వియ్యంకులు ఒకటయ్యారు" నవ్వారు ఆయన. అలా నవ్విన మహారాజు నవ్వుతూనే ఉన్నారు ఉన్నన్నాళ్ళూ. ఏడాది తిరగకుండా రాఘవ పుట్టాడు. ఆయనగారు మాత్రం నేనోచిన బీదనోముల ఫలాన మరో పుష్కరం చూళ్ళేదు. అయితేనేం? ఆయనతో గడిపిన ప్రతిక్షణం నా మనసుకి మహాపుష్కరం.

ఈరోజు, ఇన్నేళ్ళకి, ఈ వయసులో మా వెర్రినాగన్న అడుగుతాడు "నువ్వెందుకే పుష్కరాలకి రానంటావ్? ఇంత బతిమాలించుకుంటావ్? ఎన్ని పుష్కరాలు చుశావేం?" అంటూ. గుర్తుండి - వయసొచ్చి జ్ఞానం తెలిసిన తరువాత చూసింది ఒక్కటే, కానీ నాకు తెలుసు నా జీవితానికదొక్కటే పుష్కరం అని.

*(స్వాతి వారపత్రిక నుంచీ పునర్ముద్రితం)*

●●●

Click here to share your comments on this story